పెండింగ్ పనులపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పంజేషాలోని క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష నిర్వహించి డివిజన్ల వారీగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, వీధి దీపాల నిర్వహణ, రోడ్లు, ఇతర సమస్యలపై చర్చించారు. కొత్త పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహీద్, జీహెచ్ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏఈలు, పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సులు లేకుంటే చర్యలు తప్పవు



మలక్‌పేటలో తనిఖీలు నిర్వహిస్తున్న రుద్ర శ్రీనివాస్

చాదర్‌ఘాట్: నగర కమిషనర్ ఆదేశాల మేరకు సర్కిల్–6 పరిధిలోని ప్రతి డివిజన్‌లో ట్రేడ్ లైసెన్స్‌లపై తనిఖీలు నిర్వహిస్తామని ఏఎం హెచ్ఓ రుద్ర శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారంలో రెండ్రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. పలు హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవడం లేదని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.


నూతన కమిటీ ఎన్నిక



చంద్రశేఖర్‌గుప్తాను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీనివాసుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, లక్ష్మయ్య, మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్త, జాయింట్ సెక్రటరీలుగా గౌరిశంకర్, రాంకిషన్, శ్రీధర్, కోశాధికారి కృష్ణయ్య, జాయింట్ ట్రెజరర్‌గా దండు రాజు, సభ్యులుగా బాలరాజు, జయరాం, కళ్యాణ్, లచన్న, మల్లారెడ్డి, మల్లికార్జున్‌రావు, ప్రకాష్‌రావు, ప్రసాద్, రామయ్య, శ్రీనివాసులు, జీ. శ్రీకాంత్, పి. శ్రీకాంత్, సుబ్బారావు, వినోద్‌కుమార్, వీరరెడ్డి, విజయకుమార్, ఉమాపతిరావు, ఉపేందర్, ఎల్లారావును ఎన్నుకున్నారు. గత 35 ఏళ్లుగా సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏకగ్రీవంగా నియమితులైన గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తాను కాలనీవాసులు సన్మానించారు.

ప్రజల మన్ననలు పొందాలి



డీసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజ్యానాయక్

మలక్‌పేట: ఎస్సైగా పదోన్నతి పొందిన మురావత్ తేజ్యానాయక్ ఆదివారం సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, మలక్‌పేట ఏసీపీ సుబ్బారామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజల మన్నలు పొందేలా పనిచేయాలని డీసీపీ సూచించారని సూచించినట్లు ఎస్సై తెలిపారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీలలో లోవోల్టేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో కాలనీలో లోవోల్టేజి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు.

10 లక్షల అవినీతి.. ఉన్నతాధికారుల వైఖరేంటి?

ఐఎస్‌సదన్‌లో సర్వత్రా చర్చ

- రోడ్డు వేయకుండానే వేసినట్లు రికార్డులు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు
- ఉన్నతాధికారుల మౌనంపై ఆగ్రహం



సైదాబాద్: జీహెచ్ఎంసీ అధికారుల అవినీతి బహిర్గతం కావడం.. దాన్ని కప్పి పుచ్చుకునేందుకు వారు అక్రమ యత్నాలకు పాల్పడటం, గత రెండ్రోజులుగా ఐఎస్‌సదన్‌లోని అన్ని ప్రాంతాల్లో ఇదే చర్చ కొనసాగుతుంది. గత మూడేళ్లుగా డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనులు ఎన్ని..? జరిగినవి ఎన్ని? అంటూ పలువురు ఆరా తీస్తున్నారు. తమ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతాయా లేక ఆయా సమస్యలు పరిష్కారం అయినట్లు అధికారులు రికార్డులు తారుమారు చేశారా అంటూ అయోమయానికి గురవుతున్నారు.

కార్పొరేటర్ ఫిర్యాదుతో వెలుగులోకి..

గతేడాది గణేష్ నిమజ్జన ఉత్సవ సమయంలో సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద సీసీ రహదారి నిర్మాణానికి జీహెచ్ఎంసీ సుమారు రూ. 10 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారుతో జీహెచ్ఎంసీ ఏఈ స్థాయి అధికారి కుమ్మక్కయ్యాడు. అక్కడ రోడ్డు వేయకుండానే రికార్డుల్లో రోడ్డు వేసినట్లు తప్పుడు నమోదు చేసి సొమ్మును తమ జేబుల్లోకి మళ్లించుకున్నారు. ఇదే విషయంపై ఆరా తీసిన కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి పూర్తి వివరాలతో రెండ్రోజుల క్రితం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు, కాంట్రాక్టర్ల అవినీతి భాగోతం బట్టబయలైంది.

రాత్రికి రాత్రే రోడ్డు వేసేందుకు యత్నం..

రోడ్డు వేయకుండానే వేసామని అవినీతికి పాల్పడిన జీహెచ్ఎంసీ అధికారి తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరో తప్పుకు తెర తీసాడు. రూ.10 లక్షల మేర తమ అవినీతి భాగోతం బయటకు వచ్చినందున దానిని సరి చేసుకోవానికి



వేయకుండానే వేశామని చెబుతున్న రోడ్డు ఇదే..

చేసిన యత్నాలు విఫలమయ్యాయి. తమ బండారం బయటపడ్డ రోజు రాత్రి తాము రహదారి వేసామని రికార్డుల్లో రాసిన సింగరేణి కాలనీ వాంబే గృహాల వద్దకు జేసీబీ, సిబ్బందితో చేరుకున్నాడు. అయితే అప్పటికే వారిపై నిఘా పెట్టిన స్థానికులు వారి ప్రయత్నాన్ని అడ్డుకొని తిప్పి పంపించారు.

మౌనమెందుకో?

ప్రస్తుతం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో విధుల్లో లేని జీహెచ్ఎంసీ అధికారి రాత్రికి రాత్రి ఇక్కడ రహదారి నిర్మించడానికి యత్నించడమే అతని



శనివారం రాత్రి రోడ్డు వేసేందుకు జేసీబీతో వచ్చిన దృశ్యం

అవినీతిని తెలియజేస్తుందని స్థానికులు అంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారి, కాంట్రాక్టర్ల అవినీతి వెలుగు చూసి రెండు రోజులు అవుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించడమే కాకుండా ప్రజాధనాన్ని అక్రమంగా కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై తన జేబుల్లోకి వేసుకున్న అధికారిపై, కాంట్రాక్టర్‌పై చర్యలు ఎందుకు తీసుకోడం లేదని అంటున్నారు. ఈ వ్యవహారాన్ని గమనిస్తే సదరు అధికారులు ఈ ఒక్క అభివృద్ధి విషయంలోనేనా, ఇలాగే మరిన్ని పనుల విషయంలోనే ఇలానే చేశారా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఐఎస్‌సదన్‌లో చోటుచేసుకున్న అవినీతి విషయమై సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి...



జీహెచ్ఎంసీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అధికారులు, కాంట్రాక్టర్లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజాధనాన్ని స్వాహా చేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇతర అధికారులకు, సిబ్బందికి తప్పు చేయాలంటే భయపడే ఆలోచన కలగాలి. అధికారులు, కాంట్రాక్టర్‌ల అవినీతి ఈ ఒక్క రహదారి విషయంలోనే జరిగిందా, మరిన్ని అభివృద్ధి పనుల్లో కూడా జరిగిందా అనే విషయాలను విచారిస్తున్నాం.

–జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, కార్పొరేటర్

విచారణ జరిపించాలి..



ఐఎస్‌సదన్ డివిజన్‌లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలి. మూడేళ్లుగా అసలు ఐఎస్‌సదన్‌లో మంజూరైన అభివృద్ధి పనులు ఎన్ని, వాటిలో ఎన్ని పూర్తి చేశారు అనే విషయాలు సమగ్రంగా విచారించాలి. అభివృద్ధి పనుల్లో అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు కావటం హేయమైన చర్య. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలి.

– షేక్ మహమూద్–ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.31, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.15, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.35, మునగ రూ.55, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.19, కీర రూ.35, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

దిల్‌సుఖ్‌నగర్‌లో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఈటల విశ్వేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ నుంచి అష్టలక్ష్మి ఆలయం ఆర్చి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భారత సైనికుల వీరత్వం, త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రాజభూపాల్‌గౌడ్, సామరంగారెడ్డి, శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, పవన్‌కుమార్, వంగా మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు భరోసా ఆయుష్మాన్ కార్డులు



మాట్లాడుతున్న ఏవీఆర్.మూర్తి

చైతన్యపురి: ఆరోగ్య భద్రతకు ఆయుష్మాన్ కార్డులు భరోసా ఇస్తున్నాయని బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఏవీఆర్ మూర్తి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్‌లోని రామాలయంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ ఐక్యవేదిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధారణ పౌరులకు ఉత్తమమైన వైద్య సేవలు అందించటం కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ కార్డుల ద్వారా రూ.5 లక్షల వరకు కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్య ఖర్చుల కోసం ఉపకరిస్తుందన్నారు. బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దాదాపు 150 మందికిపైగా డౌన్‌లోడ్ చేసి ఉచితంగా అందించామన్నారు. ఈ సమావేశంలో సోమేశ్వరులు, మోహనాచార్య, సరళ, శ్రీనివాస్, విజయభాస్కర్, శిరిష, అనిత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి



మాట్లాడుతున్న రవీంద్రచారి

నాగోలు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కారవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు కందుల సుధాకర్ అధ్యక్షతన న్యూనాగోలు కాలనీలో ఎస్ ఏ డాంగే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ సీపీఐకి ప్రజాదరణ ఉందని అన్నారు. ఎల్‌బీనగర్ ప్రాంతంలో అనేక బస్తీలు ఏర్పాటు చేసిన ఘనత సీపీఐ పార్టీ ఎర్రజెండాకే దక్కుతుందన్నారు. కర్రెగుట్టలో జరిగే బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రతి ఒక్కరు ఖండించాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వాలు చూడాల్సింది పోయి అమాయక గిరిజనులు, ఆదివాసీలను పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 28న జరిగే సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామిడి శేఖర్ రెడ్డి, బాతరాజు నర్సింహ, సుధాకర్, శ్రీనివాస్ శోభ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతులు కల్పిస్తా



శ్మశానవాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: ఎస్సీ శ్మశానవాటికలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని ఎస్సీ శ్మశానవాటికను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎస్సీ శ్మశానవాటికలో స్నానపు గదులు, నీటి సౌకర్యం, మూత్రశాలలు, మెయిన్‌గేట్, హైమాస్ట్ లైట్లతో పాటు విద్యుత్ దహనశాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొదండ సూరి, సత్యనారాయణ, లక్ష్మీదాస్, లక్ష్మినర్సింహ్మా, జంగయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కాలనీల్లో ఏర్పాటు చేసే ఓపెన్ జిమ్‌లను స్థానికులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ జనప్రియ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం శానిటైజేషన్ వీధి దీపాలు తదితర సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్విన్ సింగ్, ఉమ మహేశ్వర్ రావు, మల్లేష్, శ్రీనివాస్ నాయుడు, ఆర్కే శంభు, విజయ్ కుమార్, హేమలత, వేణు, అరవింద్, నాయకులు మంచి రాజేష్, సుందర్ నారాయణ, వెంకట్ రెడ్డి, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా అలయ్ బలయ్



లింగోజిగూడ: తెలుగు రాష్ట్రాల ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్‌లో తెలుగు రాష్ట్రాల ఎరుకల అలయ్ బలయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎరుకల కులస్తులకు ఎప్పుడూ నా మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎరుకల కులస్తులు తమ కుల వృత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, నాగార్జున, శేఖర్, శ్యామల, రాజు, వెంకట్రాములు, జగదీష్, వెంకటయ్య పాల్గొన్నారు.

బస్తీ అభివృద్ధికి సహకరిస్తా



మట్టి పోయించేందుకు చెక్కు ఇస్తున్న జక్కిడి రఘువీర్‌రెడ్డి

మన్సూరాబాద్: వీరన్నగుట్ట బస్తీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని బీఆర్ఎస్ యువనేత, జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని వీరన్నగుట్ట బస్తీలో జక్కిడి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బస్తీలోని పార్కు స్థలంలో మట్టి పోయించి చదును చేశారు. ఈ సందర్భంగా రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బస్తీకి ఉపయోగపడే కార్యక్రమానికి రూ.30 వేలతో మట్టి పోయించి చదును చేసి కాలనీ అవసరాలకు పార్కును సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం సమీపంలో జరుగుతున్న ట్రంక్‌లైన్ పనులను పరిశీలించారు.

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ బదిలీ

హస్తినాపురం: వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాస్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు శనివారం హైదరాబాద్ రేంజ్‌కు బదిలీ చేశారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా గతేడాది అక్టోబర్ మాసంలో బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ ఏడున్నర నెలల పాటు పని చేశారు. శ్రీనివాస్ బదిలీ కావడంతో ఇన్‌చార్జిగా డీఐ రాజేశ్‌ను నియమించారు.

బాలుడి అదృశ్యం



ఉపేందర్

హస్తినాపురం: సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఓ బాలుడు ఇంట్లో వెళ్లిపోయిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన కందుకూరి ఉపేందర్ (14) తన తల్లిదండ్రులతో కలిసి సాగర్‌కాంప్లెక్స్‌లో ఉంటున్నారు. శనివారం రాత్రి తన తండ్రిని సెల్‌ఫోన్ అడగడంతో ఇవ్వలేదు. మనస్తాపం చెందిన ఉపేందర్ కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

నాగోలు: బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్వీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గుండుమల్ల పాండుగౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాగర్‌రెడ్డి,జహీర్‌ఖాన్, లింగాల రాహుల్‌గౌడ్, వెంకట్, యాదగిరి, భాస్కర్, సచిన్, ఉదయ్ పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే దైవభక్తి పెంపొందించాలి



ప్రసంగిస్తున్న నర్సింహమూర్తి

చైతన్యపురి: చిన్నతనం నుంచే దైవభక్తి పెంపొందేలా చూడాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నర్సింహ, వీహెచ్‌పీ మాతృశక్తి సంయోజక్ నాల్లన్ చక్రవర్తుల పద్మశ్రీ అన్నారు. శ్రీవిరాట్ విశ్వకర్మ సేవా సమితి సౌజన్యంతో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 25 రోజుల పాటు నిర్వహించిన బాల సంస్కార వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం గౌతంనగర్‌లో జరిగింది. ముఖ్య వక్తలుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అనేది మన సనాతన ధర్మం అని నేడు విజయాల కన్నా జీవన విధానం గొప్పదన్నారు. పిల్లలకు దైవభక్తి, దేశభక్తి అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలోఅనంతాచారి, లింగాల ప్రవీణ్, లోక్‌నాథ్, సద్ది శ్రీవాణి, లతశ్రీ, మహాలక్ష్మి, లక్ష్మీనారాయణ, జ్యోతి, లావణ్య పాల్గొన్నారు.

భారత సైన్యానికి అండగా ఉందాం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దిల్‌సుఖ్‌నగర్: భారత జాతి ఆత్మగౌరవం కాపాడుటకు మోదీ విశ్వ ప్రయత్నం చేస్తున్నారని భారత సైన్యం, మోదీకి మనమందరం అండగా ఉందామని ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. సిటిజెన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొత్తపేట ఓమ్ని హాస్పిటల్ నుంచి ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి కమాన్ వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో వారు పాల్గొని దేశ సైనిక అధికారులు వ్యోమికా సింగ్, సోఫియా ఖురేషీ, ఉగ్రవాదులను అంతమొందించేందుకు ముందుకు రావడం గర్వకారణమన్నారు. 25 నిమిషాల్లో 9 పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద మూకల స్థావరాలపై దాడులు చేసి మన దేశ ఘనత చాటి చెప్పామని తెలిపారు. గతంలో దొంగచాటుగా ఉగ్ర మూకలు దాడులు చేశాయని నరేంద్ర మోదీ హయాంలో ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి 356 ఆర్టికల్ రద్దు చేసి లాల్ చౌక్‌పై మువ్వన్నెల జెండా ఎగరవేసిన మహనీయుడు అన్నారు. నేటి యువత సైన్యంతో కలిసి పోరాడానికి సిద్ధంగా ఉండన్నారు.ఈ తిరంగా యాత్రలో ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధరీజ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ రంగారెడ్డి, పిట్ట ఉపేందర్‌రెడ్డి, శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.

రూ. 5 లక్షలతో నిర్మించారు... అప్పనంగా వదిలేశారు!



నల్గొండ క్రాస్ రోడ్ వద్ద నిరుపయోగంగా డీసీ కార్యాలయం



బీ బ్లాక్ క్వార్టర్స్‌లో ప్రస్తుత కార్యాలయం

చాదర్‌ఘాట్: సర్కిల్ కార్యాలయాలు ఆయా ప్రాంతాల్లోనే ఉండాలని గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు చార్మినార్ సర్దార్ మహల్‌లో ఉన్న మలక్‌పేట సర్కిల్ కార్యాలయం అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల జాతీయ ఉద్యానం ఆవరణలోకి మార్చారు. ఆ సమయంలోనే సుమారు రూ. 5 లక్షల వ్యయంతో కార్యాలయంలో అదనపు గదిని నిర్మించడంతో పాటు సౌకర్యాలు కల్పించారు. అప్పటి నుంచి ఉప కమిషనర్ ఇతర సిబ్బంది ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల నల్గొండ చౌరస్తాలోని సర్కిల్ కార్యాలయాన్ని అక్బర్‌బాగ్ డివిజన పరిధి మలక్‌పేట బీ–బ్లాక్ క్వార్టర్స్‌లోకి తరలించారు. ప్రజాధనం వెచ్చించి అదనంగా నిర్మించిన గది నిరుపయోగంగా మారిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన రోడ్డు నుంచి లోపలికి

ప్రస్తుతం సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేసిన బీ బ్లాక్ క్వార్టర్స్ ప్రధాన రహదారి నుంచి లోపలికి ఉంటుంది. గతంలో నల్గొండ చౌరస్తాలో ఉన్నప్పుడు వివిధ అవసరాల కోసం వచ్చే వారి రాకపోకలకు వీలుగా ఉండేది. ఆర్టీసీ, మెట్రో, వ్యక్తిగత వాహనాలపై కార్యాలయానికి సులువుగా వచ్చే అవకాశం ఉండేది. నియోజకవర్గం పరిధిలోని సైదాబాద్, అక్బర్‌బాగ్, మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, ఛావుని డివజన్ల నుంచి సర్కిల్ కార్యాలయానికి సులువుగా చేరుకునే వారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన మలక్‌పేట బీ బ్లాక్ ప్రాంతం ఇటు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారికి అటు సైదాబాద్ రహదారికి లోపల ఉంటుంది. ప్రజారవాణ వ్యవస్థ అందుబాటులో లేదు. వ్యక్తిగత వాహనాలపైనే రావాలి లేకపోతే ఆటోలు, క్యాబ్‌లు ఆశ్రయించాలి. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కార్యాలయాన్ని తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.